పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి: కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: దేశంలోని ప్రతి రాష్ట్రంలో యువత బీజేపీ వైపు మొగ్గుచూపుతోందని చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు కొండావిశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోది చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. సభ్యత్వ నమోదు ప్రతి బూత్‌లో 400 మంది చొప్పున, డివిజన్ వ్యాప్తంగా 20వేల సభ్యత్వాలను టార్గెట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అడికె జనార్ధన్, బూత్ కోఆర్డినేటర్, పార్టీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గడ్డం వెంకటస్వామి జయంతి



వెంకటస్వామి జయంతిలో చైర్మన్ కస్తూరి నరేందర్ తదితరులు

మణికొండ: బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం శ్రమించిన నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి వెంకటస్వామి అంటూ మున్సిపాలిటీ చైర్మన్ కస్తూరి నరేందర్ కొనియాడారు. మున్సిపాలిటీ కార్యాలయంలో గడ్డం వెంకటస్వామి జయంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కస్తూరి నరేందర్ ముఖ్య అతిధిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ శ్రీధర్, డిఈ సాయిశివ, ఏఈఈ సంజయ్, సంతోష్‌సింగ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: అనారోగ్యాలతో ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న పేదలు సీఎం సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన రవీందర్‌కు రూ. 60వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వే



ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న ఉపకమిషనర్ రవికుమార్, సిబ్బంది

అత్తాపూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డిజిటల్ ఫ్యామిలీ కార్డుల సర్వే ద్వారా అర్హులను గుర్తిస్తున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ వెల్లడించారు. డివిజన్ హైదర్‌గూడ గుమ్మకొండ కాలనీలో శనివారం ఇంటింటికి తిరుగుతూ ప్రజల వివరాలను సేకరించి నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ ఆధార్ కార్డుతో సహా పూర్తి వివరాలను ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి అందించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు సన్మానం



మైలార్‌దేవ్‌పల్లి: చిన్నారులకు విద్యపై అవగాహన పెంచడానికి అంగన్‌వాడీ పాఠశాలలు ఎంతగానో దోహదపడుతాయని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు కుమారస్వామి అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం డివిజన్ పరిధిలోని ఆదర్శ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలోని ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిక్షపతి, రాజు, నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో తోకల శ్రీనివాస్ రెడ్డి తదితరులు

రాజేంద్రనగర్: బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు బాబు రావు ఆధ్వర్యంలో శనివారం బుద్వేల్ 161 బూత్‌లో ఇంటింటికి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో ప్రతి బూత్‌లో 200 సభ్యత్వ నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, మక్తల్ అసెంబ్లీ ఇన్‌చార్జి బాల్‌రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు



పద్మశాలిపురంలో కొలువుదీరిన అమ్మవారు



అత్తాపూర్‌లో..



మార్కండేయనగర్‌లో పూజలందుకుంటున్న అమ్మవారు

మైలార్‌దేవ్‌పల్లి: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 3వ రోజు ఘనంగా జరుపుకున్నారు. శనివారం డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం, మార్కండేయనగర్‌లలో కొలువుదీరిన అమ్మవారికి భక్తులు ఉదయం నుంచి అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. పద్మశాలిపురం జైమాతాది యూత్ మండప నిర్వాహకులు అమ్మవారి తొమ్మిది రోజుల దీక్షను తీసుకొని ఉదయం నుండి సాయంత్రం వరకు ఉపవాస దీక్ష చేస్తున్నారు. మార్కండేయనగర్‌లో నవోదయ యూత్ ఆధ్వర్యంలో స్థానికులు తిరునగర్ గోపాల్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నవరాత్రులు భక్తి శ్రద్ధలతో ఉంటూ ఆనందంగా జరుపుకుంటున్నామని నిర్వాహకులు తెలిపారు.

అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు..

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 3వ రోజు యాదవ మిత్ర కాలనీలో అమ్మవారిని అన్నపూర్ణాదేవీగా అలంకరించారు. ఆలయాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారికి పూజలు చేసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు భారీ ఏర్పాటు చేశారు.



అన్నపూర్ణ దేవీకి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా నవరాత్రి వేడుకలు



శంషాబాద్: పట్టణంలోని ధర్మగిరి ఆలయంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి, నిత్యహోమం, పారాయణం, అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. కాపుగడ్డలోని నాగలింగేశ్వరాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.



బుద్వేల్ కోట మైసమ్మ తల్లికి హారతి ఇస్తున్న భక్తులు



పోచమ్మ ఆలయంలోని పూజల్లో పాల్గొన్న భక్తులు



కట్ట మైసమ్మ ఆలయంలోని పూజల్లో భక్తజనం

వైభవంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

రాజేంద్రనగర్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం బుద్వేల్ కోట మైసమ్మ తల్లిని అన్నపూర్ణాదేవీగా అలంకరించారు. కట్ట మైసమ్మ, పోచమ్మ ఆలయాల్లో సైతం అమ్మవారిని అన్నపూర్ణాదేవీగా తీర్చిదిద్దారు. వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికై భక్తులు వేలసంఖ్యలో తరలివచ్చారు.



అన్నపూర్ణాదేవీగా అమ్మవారు

మణికొండ: దసరా నవరాత్రి పూజలు ఘనంగా కొనసాగుతున్నాయి. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని పలు వార్డులలో నెలకొల్పిన అమ్మవారి ప్రతిమల వద్ద ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలలో 3వ రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవీగా దర్శనం ఇచ్చారు. మణికొండ భాగ్యలక్ష్మి కాలనీ దుర్గామాత ఆలయంలో అమ్మవారిని పలు రకాల కూరగాయలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కుంకుమార్చనలు నిర్వహించి దర్శనాలు చేసుకున్నారు.

నేడు నార్సింగిలో జాగరణ...

నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని లక్ష్మమ్మ ఆలయం ఆవరణలో ఆదివారం రాత్రి పెద్ద ఎత్తున అమ్మవారి జాగరణ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, కౌన్సిలర్ లక్ష్మీప్రవళిక, కిరణ్ తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భజనలు, కీర్తనలతో అమ్మవారిని పూజించాలని వారు కోరారు.



క్వార్టర్స్‌లోని అమ్మవారి పూజల్లో కాలనీ వాసులు

సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చు



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి



అత్తాపూర్: క్రైమ్ రేటును నియంత్రించేందుకు సీసీ కెమెరాల పాత్ర ఎంతో ఉపయోగపడుతుందని ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. సులేమాన్‌నగర్ ప్రాంత ప్రజల సౌకర్యార్థం స్థానిక కమిటీ 12 కెమెరాలను కొనుగోలు చేసిందన్నారు. ఈ మేరకు స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెంకటరామిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ సమయంలోనైనా దోపిడీలు, దొంగతనాలు జరిగిన సందర్భాలలో ప్రత్యక్షంగా ఎవరూ చూడకపోయినా.. ఆయా ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలలో ఆ ఘటనలు నిక్షిప్తంగా ఉంటాయని, నిందితులను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

తెలంగాణ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం

రాయదుర్గం: విభిన్న రంగాలలో ప్రతిభ చాటిన వారిని ఘనంగా సత్కరించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో శనివారం తెలంగాణ ఐకాన్ అవార్డుల పేరిట ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లు, బ్లాగర్లు, ఇతరులకు అవార్డులను అందించారు. తెలంగాణ మాజీ సీఎస్ అజయ్‌మిశ్రా జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తెలంగాణ ఐకాన్ అవార్డుల రెండో ఎడిషన్ కార్యక్రమంలో విభిన్న రంగాల వారికి అవార్డులు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీస్ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ, ఏఐసీసీ కిసాన్ కాంగ్రెస్ జాతీయ సమన్వయకర్త మహ్మద్ ఖలీకర్ రెహమాన్, బీఎస్ఐ హైదరాబాద్ ఈడీ సంజనా షా, తెలంగాణ బ్లాగర్స్ కమ్యూనిటీ వ్యవస్థాపకుడు అబ్దుల్ మొయిద్ ,విజిట్రాన్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంఆర్ నజీమ్‌షేక్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

శంషాబాద్: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో శనివారం శ్రీవారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. బాలభోగం, పల్లకి సేవ కార్యక్రమాలు నిర్వహించారు. వేద మంత్రాలతో నిర్వహించిన కల్యాణాన్ని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కల్యాణాన్ని చేవెళ్ల నియోజకవర్గ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కార్తీక్‌రెడ్డి తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు వివేకానంద గుప్తా, రామకృష్ణ గుప్తాలు, మధుసూదన్ గుప్తా, ఆకులరవి, రాఘవేందర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



స్వామి వారి కల్యాణోత్సవం

పోలీసు పహారా పెంచండి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ, నెక్నాంపూర్ గ్రామాల పరిధిలోని అన్ని కాలనీలలో ఎలాంటి సంఘవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా పటిష్ట పహారా పెంచాలని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ అవినాష్ కోరారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో ఫెడరేషన్ నాయకులు నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని కలిసి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయటంతో పాటు వాటిని పోలీస్‌స్టేషన్‌తో అనుసంధానించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి షాపు ప్రారంభోత్సవం అయినా వందల మంది హిజ్రాలు వచ్చి బలవంతంగా డబ్బులు దండుకుంటున్నారని, స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వివరించారు. ప్రతి కాలనీ, వీధిలోను పోలీస్ పెట్రోలింగ్ పెంచి నేరాలను అరికట్టాలని సీఐని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కోశాధికారి బాబురావు, అలకాపూర్ టౌన్‌షిప్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



నార్సింగి ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ నాయకులు

బతుకమ్మ సంబురం



సీబీఐటీలో..

మణికొండ: తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని మహాత్మ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గండిపేట్‌లోని ఎంజీఐటీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర పూల పండుగ బతుకమ్మ 4వ రోజు నానబియ్యం బతుకమ్మ ఉత్సావలను వైభవంగా నిర్వహించారు. తంగేడు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో చేసిన బతుకమ్మ చుట్టూ సాంప్రదాయ దుస్తులను ధరించిన విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు చేరి బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ ఉత్సవంగా సంబరాలు చేసుకున్నారు. బతుకమ్మ సంబరాల సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలుగా వచ్చినవారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు శ్వేత, శారదా, సబిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీబీఐటీ కళాశాలలో...

గండిపేట్‌లోని చైతన్య భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం దసరా, బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించగా, విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థినులు సాంప్రదాయ వస్త్రాధారణలో కళాత్మకంగా బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నర్సింహులు హాజరయ్యారు.



ఎంజీఐటీ కళాశాలలో..

ఇండిగో ఎయిర్‌లైన్ నెట్‌వర్క్‌లో సాంకేతిక సమస్య

శంషాబాద్: ఇండిగో ఎయిర్‌లైన్ నెట్‌వర్క్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యతో ప్రయాణికులు కొంత ఇబ్బంది పడ్డారు. ఎయిర్‌లైన్స్ నెట్‌వర్క్ స్లోడౌన్ కావడంతో బుకింగ్, బోర్డింగ్ ప్రక్రియ మధ్యాహ్నం సమయంలో నిలిచిపోయింది. ప్రధానంగా దేశీయ ఎయిర్‌లైన్స్ బుకింగ్‌ల ప్రక్రియలోనే ఈ సమస్య ఏర్పడడంతో శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రయాణించే ప్రయాణికులు బారులు తీరారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు అసహనానికి లోనయ్యారు. కొన్ని విమానాలు నిర్దిష్ట సమయానికి కొంత ఆలస్యంగా నడిచినట్లు సమాచారం.

హైడ్రాకు సీపీఐ ఫిర్యాదు

శేరిలింగంపల్లి: కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ హైడ్రా కమిషనర్‌కు సీపీఐ (ఎం) శేరిలింగంపల్లి కార్యదర్శి సి.శోభన్ శనివారం ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ సర్వే నంబర్ 41/14లో దాదాపు 250 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా గత ప్రభుత్వ హయాంలో కార్పొరేట్ హాస్పిటల్స్, రియల్ ఎస్టేట్ సంస్థలకు కొంతభాగం కేటాయించారని పేర్కొన్నారు. ఇటీవల ఎకరం భూమిలో నిర్మాణలు చేస్తున్నారని, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అనుమతులు ఎలా వచ్చాయో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై గతంలో తాము రెవెన్యూ అధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ (ఎం) కార్యవర్గ సభ్యులు కృష్ణ, మాణిక్యం, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో నీటి బిల్లులు రద్దు చేయాలి



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ సంజయ్‌యాదవ్

శంషాబాద్: మున్సిపాలిటీలో నీటి బిల్లులు రద్దు చేయాలని మంత్రి శ్రీధర్ బాబును కాంగ్రెస్ అధ్యక్షుడు కౌన్సిలర్ సంజయ్‌యాదవ్ కోరారు. మున్సిపాలిటీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కౌన్సిలర్ మంత్రిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు సైతం వేలాది రూపాయల నీటి బిల్లులు వస్తున్నాయని, జీహెచ్ఎంసీలో మాదిరిగా ఇక్కడ కూడా ఉచిత నీటిని అందించే వెసులుబాటు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒక్క మున్సిపాలిటీలో చేస్తే రాష్ట్రమంతా చేయాల్సి ఉంటుందని, ఈ విషయం పై మరోసారి ఆలోచిద్దామన్నారు.

బీజేపీ నేతల వినతి

బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్ ఆధ్వర్యంలో నేతలు పలు సమస్యల పై మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం సమర్పించారు. రహదారుల విస్తరణ చేపట్టాలని, పట్టణంలో యాభై పడకల ఆసుపత్రి నిర్మాణం చేయాల్సిందిగా కోరారు. సర్వీసు రహదారుల పనులు పూర్తి చేయడం, అక్రమ కట్టడాల పై చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రేటర్ వద్దు..

మున్సిపాలిటీ గ్రేటర్‌లో విలీనం చేయొద్దని మున్సిపల్ వైస్‌చైర్మన్ సభాముఖంగా మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. స్థానికంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరముందన్నారు. అంతేకాకుండా పాలకవర్గ గడువు ముగియకముందే యాభై కోట్ల నిధులు సమకూరిస్తే అభివృద్ధి పనులు చేపడతామన్నారు.

క్రమబద్ధీకరించండి..

మున్సిపాలిటీలో గత 20 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులు మంత్రి శ్రీధర్‌బాబుకు నేరుగా వినతి పత్రం అందజేసి తమ సమస్యలను తెలిపారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, చాలిచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

11, 12 తేదీల్లో దసరా ఉత్సవాలు

రాయదుర్గం: టెలికాంనగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో 11,12 తేదీల్లో రెండురోజుల పాటు దసరా ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి తెలిపారు. 11న ఉదయం 6 గంటలకు సాయిబాబాకు కాగడ హారతితో ప్రారంభిస్తారు. అనంతరం 7.30 నుంచి 9 గంటల వరకు సాయిబాబా ,దత్తాత్రేయస్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం పల్లకీసేవ ఉంటుందన్నారు.అనంతరం జమ్మి పూజ జరుగుతుందన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటాం



హైదర్షాకోట్‌లో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, నగదు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి తదితరులు

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న కార్మికులకు అండగా ఉంటున్నామని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. హైదర్షాకోట్ గ్రామంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండుగ సందర్భంగా తన సొంత డబ్బుతో చీరలు, నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు తమ ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా సేవలు అందిస్తున్నారన్నారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.



మున్సిపాలిటీ సిబ్బందికి వస్త్రాలు అందజేస్తున్న చైర్మన్ కస్తూరి నరేందర్ తదితరులు

మున్సిపాలిటీ సిబ్బందికి నూతన వస్త్రాల అందజేత

మణికొండ: కార్మికుల సేవలను గుర్తించి ఎప్పటికప్పుడు ప్రొత్సహించాలని మున్సిపాలిటీ చైర్మన్ కస్తూరి నరేందర్ అన్నారు. కస్తూరి సత్తయ్య, నర్సయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయదశమి పండుగ పురస్కరించుకొని 500 మంది మున్సిపాలిటీ సిబ్బందికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కస్తూరి నరేందర్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రతి పండుగకు తన సొంత ఖర్చుతో కార్మికులకు నూతన వస్త్రాలు, నగదు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం కార్మికులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రదీప్‌కుమార్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కస్తూరి బాలరాజ్, కస్తూరి రాములు, యాదయ్య, కౌన్సిలర్లు పురుషోత్తం, వందన, జ్యోతి, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపాలిటీ సిబ్బందికి భోజనం వడ్డిస్తున్న కస్తూరి నరేందర్